క్లుప్తంగా

వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలి



శిబిరానికి వచ్చిన వారికి బ్యాగ్‌లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులు, దీర్ఘ కాలిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆదేశించారు. బుధవారం నగరంలోని ఇందిరమ్మ హౌసెస్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అక్కడికి వచ్చిన రోగులందరికీ వైద్యసేవలు అందుతున్నాయా, అవసరమైన వారికి ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నారా అని ఆరా తీశారు. శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్థానికంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం గాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా, ఫైలేరియా ప్రబలకుండా దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలని సూచించారు.

మెస్ చార్జీలను విడుదల చేయండి

కర్నూలు(అర్బన్): బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని బీసీ విద్యార్థి, యువజన సంఘం జాతీయ కార్యదర్శి కె. రామక్రిష్ణ కోరారు. బుధవారం ఆయన బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ పీజీ చదువుతున్న బీసీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలన్నారు. అలాగే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలన్నారు. బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని, కర్నూలు జిల్లాలో నూతనంగా బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు

కర్నూలు కల్చరల్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రా ల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి,జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేశా రు. బుధ వారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాణ్యం మాజీ శాసనసభ్యులు గౌరుచరిత, బీఎస్పీ పార్టీ ప్రతినిధి చిరంజీవి, టీడీపీ ప్రతినిధి ఆర్.యశ్వంత్ రెడ్డి, బీజేపీ, సీపీఎం పార్టీ ప్రతినిధులు, కల్లూరు, ఓర్వక ల్లు,గడివేముల, పాణ్యం తహసీల్దార్లు పాల్గొన్నారు.

గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని..



చెన్నమ్మ సర్కిల్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శిస్తున్న కార్పొరేటర్లు, నాయకులు

కల్లూరు: టీడీపీ సోషల్ మీడియా ట్రోలింగ్‌తో తెనాలికి చెందిన గీతాంజలి అనే మహిళ మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకుందని డిప్యూటీ మేయర్ రేణుక, కల్లూరు అర్బన్ కార్పొరేటర్లు అన్నారు. బుధవారం రాత్రి కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో కొవ్వొత్తులు పట్టుకుని శాంతి ర్యాలీ నిర్వహించారు. గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె ఎదుర్కొన్న పరిస్థితి మరే మహిళకు రాకూడదన్నారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీలను కాపాడుకుందాం

మనిషి శరీరంలో అతికీలకమైన అవయవం కిడ్నీ (మూత్రపిండం). ఇది సరిగా లేకపోతే రక్తాన్ని వడబోయడం కష్టమై శరీరం వ్యాధుల బారిన పడుతుంది. కొన్నిసార్లు ప్రాణం మీదకు వస్తోంది. అందుకే కిడ్నీలను చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నేడు (గురువారం) అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- గతంలో పది మందిలో ఒకరికి కిడ్నీ జబ్బు
- ప్రస్తుతం ఏడుగురిలో ఒకరికి ఈ సమస్య
- బీపీ, షుగర్‌తోనే కిడ్నీకి ఇబ్బంది
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స
- నేడు అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని నెఫ్రాలజి విభాగంలో ప్రతి నెలా ఇన్‌పేషంట్లు 1,400 మంది, ఓపీ రోగులు 6 వేల మంది దాకా చికిత్స పొందుతున్నారు. ఈ విభాగంలో ప్రతి నెలా 1300 మంది దాకా కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేస్తున్నారు. 2019 ఆగస్టులో ఓర్వకల్లుకు చెందిన ఆంజనేయులు అనే 20ఏళ్ల యువకునికి మొదటిసారి కిడ్నీ మార్పిడిని విజయవంతంగా చేశారు. ఇటీవల మరో ఇద్దరికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించారు. దీంతో పాటు నగరంలోని కిమ్స్, గౌరిగోపాల్, మెడికవర్, అమీలియో, కిమ్స్, విశ్వభారతి హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ రోగులకు ఉచితంగా డయాలసిస్ అందిస్తున్నారు. అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన ఉదయం 8 గంటలకు ఆసుపత్రి నుంచి రాజవిహార్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు.

పిల్లలు, పెద్దల్లో కిడ్నీ వ్యాధులు

మూత్రపిండాల వ్యాధులు ఏ వయస్సులోనైనా కలగవచ్చు. సాధారణంగా చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చే జన్యుపరమైన వ్యాధుల వల్ల, ఇన్‌ఫెక్షన్ వల్ల మూత్రపిండాల వ్యాధులు కలుగుతాయి. పుట్టుకతో వచ్చే జన్యుపరమైన వ్యాధుల వల్ల పిల్లలు ఎదుగుదల లేకపోవడం, మూత్రం ఎక్కువగా, తక్కువగా పోవడం, కాళ్లు, చేతులు వంకర్లు పోవడం వంటివి జరుగుతాయి. ఇన్‌ఫెక్షన్ వల్ల వచ్చే వ్యాధుల వల్ల పిల్లలకు మూత్రం ఎరుపు రంగులో రావడం, కాళ్లవాపులు రావడం, ఒళ్లు దద్దుర్లు రావడం వంటివి జరుగుతాయి. అలాగే పెద్దల్లో రక్తపోటు, మధుమేహం, మూత్రపిండాల ఇన్‌ఫెక్షన్ వల్ల సాధారణంగా మూత్రపిండాలు చెడిపోతాయి. ఈ వ్యాధులు ఉన్న వాళ్లు మూత్రపిండాల వైద్యుల పర్యవేక్షణలో ఉండటం మంచిది.



పెద్దాసుపత్రిలోని నెఫ్రాలజి విభాగంలో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు

కిడ్నీ జబ్బుల లక్షణాలు

నిస్సత్తువ, వాంతి వచ్చినట్లు ఉండటం, ఆకలి లేకపోవడం, దురద, ఒళ్లునొప్పులు, మూత్రం ఎక్కువగా పోవడం, అతి తక్కువగా పోవడం, రాత్రిపూట మూత్రం ఎక్కువగా పోవడం, శరీర వాపు, చిన్నపిల్లల్లో మూత్రం ఎర్రగా రావడం, ఒళ్లు దద్దుర్లు, చిన్నపిల్లల్లో ఎదుగుదల లేకపోవడం, కాళ్లు వంకరలు పోవడం, అధిక రక్తపోటు

నివారణ చర్యలు

- రోజుకు తగిన మోతాదులో నీటిని తాగాలి
- రక్తపోటు, షుగర్ వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవాలి

మూత్రపిండాలు దెబ్బతినేందుకు కారణాలు

మధుమేహవ్యాధి, రక్తపోటు, గ్లోమెరులోనెఫ్రైటిస్(ఉబ్బు కామెర్లు), అధిక మొత్తంలో నొప్పుల మాత్రలు వాడటం, మూత్రపిండంలో రాళ్లు, జన్యుపరంగా పుట్టుకతో వచ్చే వ్యాధులు, మూత్రకోశ, మూత్రనాళ వ్యాధులు, వాంతులు, విరేచనాలు, పాముకాటు, మలేరియా, పచ్చకామెర్లు, లెప్టోస్పైరా, గర్భం సమయంలో మూత్రం ఇన్‌ఫెక్షన్, రక్తపోటు రావడం.

- ఆహారంలో ఉప్పు క్రమబద్ధీకరించుకోవాలి
- వ్యాయామం చేస్తూ చలాకీగా ఉండాలి
- ద్రవపదార్థాలు సరిపడినంత తీసుకోవాలి
- ధూమపానానికి దూరంగా ఉండాలి
- నొప్పి నివారణ మందులు ఎక్కువగా వాడరాదు
- షుగర్, బీపీ ఉన్న వారు ఆరు నెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి

మూత్ర సమస్యలుంటే నిర్లక్ష్యం చేయొద్దు



చాలా మంది మూత్రసమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటారు. కొన్నిసార్లు అవి సాధారణమే అయినా ఒక్కోసారి అది ప్రాణాంతకమైన ఆరోగ్య సమస్యగా మారుతుంది. ముఖం ఉబ్బరం, మూత్రపోయినప్పుడు చురుకు, మంట, ఎరుపు రంగులో మూత్రం రావడం, మూత్రం సరిగ్గా రాకపోవడం, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం, చిన్న వయస్సులోనే రక్తపోటు లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

–డాక్టర్ వెంకటపక్కిరెడ్డి, నెఫ్రాలజి విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

పోషకాలున్న ఆహారం తీసుకోవాలి



మారిన జీవనశైలి, సరైన పోషకాలు లేని ఆహారం తీసుకోకపోవడం, సమయానికి తినకపోవడం, నీరు ఎక్కువగా తాగకపోవడం, వ్యాయామం చేయకపోవడం, కిడ్నీ సమస్యలకు కారణం అవుతున్నాయి. నేటి ఆధునిక జీవితాల్లో మహిళలైతే పని ధ్యాసలో పడి ఆరోగ్య సంగతే మరిచిపోతున్నారు. ప్రతి సంవత్సరం ప్రతి ఒక్క స్త్రీ, పురుషులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల వ్యాధులను ముందుగానే గుర్తించి అరికట్టవచ్చు.

–డాక్టర్ సిద్దార్థ్ హెరుర్, నెఫ్రాలజిస్ట్, కర్నూలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



మేయర్‌గా ఎంపికైన సత్యనారాయణమ్మ దంపతులకు బొకే అందజేస్తున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): కురువలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ నగరంలోని 25వ వార్డు కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మను కర్నూలు మేయర్‌గా ఎంపిక చేయడం పట్ల జిల్లా కురువ సంఘం నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న మేయర్‌గా ఎంపికైన సత్యనారాయణమ్మ దంపతులకు బొకే అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురువ సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఈ పదవి వరించేందుకు సహకరించిన జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు టి. లీలమ్మ, నాయకులు పాల సుంకన్న, ధనుంజయ, నగర అధ్యక్షులు తవుడు శ్రీనివాసులు, పుల్లన్న తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యం

కర్నూలు (టౌన్): మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యమని వైఎస్‌ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి అన్నారు. 25 వ వార్డు కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మను మేయర్‌గా ప్రకటించడంతో బుధవారం ఆయన బీసీ సంఘం నాయకులతో కలిసి దేవనగర్‌లోని ఆమె స్వగృహంలో కలిసి అభినందనలు తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అవగాహన పెంచుకోండి



ఈవీఎంల గురించి అవగాహన కల్పిస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): సెక్టోరల్ అధికారులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అవగాహన పెంచుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. బుధవారం స్థానిక సుంకేసుల రోడ్డులోని నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సెక్టోరల్ ఆఫీసర్లు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ తాత్కాలికంగా ఏర్పడే సాంకేతిక సమస్యలను అధిగమించడం, పోలింగ్‌కు ఇబ్బందులు లేకుండా ప్రక్రియ కొనసాగింపు తదితర చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ రోజు ఓటర్లకు అవసరమయ్యే ఏర్పాట్లను ఆయా పోలింగ్ స్టేషన్లలో పర్యవేక్షణ చేయాలన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లు, సూపరింటిండెంట్ సుబ్బన్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ

కర్నూలు కల్చరల్ : సంస్కృత రామాయణాన్ని తెలుగీకరించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొల్లమాంబ రాసిన మొల్ల రామాయణాన్ని ప్రజలకు తెలియజేయడానికి రంగనాథ రామాయణం తప్ప ఇంకోటి లేదన్నారు. ఆమె ఎంతో కష్టపడి చదివి సమాజానికి ఒక మంచి మార్గాన్ని చూపించారన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.డి.కల్పన , డీఆర్వో మధుసూదనరావు, బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, కుమ్మరి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసులకు సత్వర పరిష్కారం

కర్నూలు (లీగల్) : ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏవైనా కేసులు ఉంటే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించి సత్వర పరిష్కారం పొందాలని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ అన్నారు. బుధవారం సత్వరంగా, సామరస్య పూర్వకంగా పరిష్కరించిన కేసు వివరాలను ఆయన వెల్లడించారు

ఎస్‌బీఎం మండల కోఆర్డినేటర్ల యూనియన్ ఏర్పాటు



యూనియన్ నూతన కార్యవర్గం

కర్నూలు(అర్బన్): స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఫేజ్ -2 లో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన మండల కో–ఆర్డినేటర్లు యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం రెండు జిల్లాలకు చెందిన కో–ఆర్డినేటర్లు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా రాజ్‌కుమార్, అధ్యక్షుడిగా ఎం. వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా క్రిష్ణయ్య, నిర్మలాదేవి, జయరాముడు, పి. విజయకుమారి, గఫూర్, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, కార్యదర్శులుగా వెంకటేష్, రాజేశ్వరి, పెద్దయ్య, కోశాధికారిగా ఎల్లప్ప తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి కర్నూలు, ఆదోని, నంద్యాల డివిజన్లకు చెందిన వారందరూ హాజరయ్యారు.

మంచి పేరు తెచ్చుకోవాలి

కర్నూలు (టౌన్): విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని నగర మేయర్ బీవై రామయ్య చెప్పారు. ఇటీవల సచివాలయ ఉద్యోగాలకు ఎంపికయిన ఏడుగురు బీకాం అభ్యర్థులకు బుధవారం మేయర్ నగరపాలక కార్యాలయంలోని తన చాంబర్‌లో నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్ మన్సూర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళా ఖైదీ మృతి

కర్నూలు : కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ అనారోగ్యానికి గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బషీరున్నీసా (46) కోలుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందారు. నెల్లూరు జిల్లా కందుకూరు గ్రామానికి చెందిన ఈమె కూతురిని హత్య చేసిన కేసులో 2019లో శిక్ష ఖరారయ్యింది. అప్పటి నుంచి కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తోంది. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో మూడు రోజుల క్రితం అక్కడి పోలీసులు తీసుకువచ్చి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందింది. జైలు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

జొహరాపురంలో గడ్డివాము దగ్ధం

జొహరాపురం గ్రామంలో అనిల్‌కుమార్‌కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. బుధవారం మధ్యాహ్నం కలందొడ్డిలో మంటలు వ్యాపించడంతో యజమాని గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.లక్ష దాకా నష్టం జరిగి ఉండొచ్చునని అధికారులు అంచనా వేశారు. గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ తాగి పడేయడం వల్ల ప్రమాదం జరిగిండొచ్చునని అగ్నిమాపక సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి...

నగరంలోని పాతబస్తీ బొంగుల బజార్‌కు చెందిన ఆటోడ్రైవర్ హుసేన్ కుమార్ (24)చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయనకు పెళ్లి కాలేదు. వీరు నలుగురు అన్నదమ్ములు. తన గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని మనస్థాపంతో వారం రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందినట్లు సోదరుడు రంగస్వామి తెలిపారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోడుమూరు: కోడుమూరు–కర్నూలు రహదారిలోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం దాడి చేసి కోడుమూరుకు చెందిన 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ బాల నరసింహులు తెలిపారు. వారి నుంచి రూ.51,500ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఐదు బైక్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.